## 9న యాదగిరి గుట్టకు మాజీ మంత్రి కేటీఆర్

- బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఎన్నికల ప్రచారం

యాదగిరిగుట్ట, మే6 : ఈ నెల 9న యాదగిరిగుట్ట పట్టణానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం రోడ్ షోలో కేటీఆర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తోపాటు నాయకులు పాల్గొంటారని, బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే..

## పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని జిల్లా మంత్రులు

- రాష్ట్రంలో మళ్లీ 2014కు ముందు పరిస్థితులు
- హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- కోదాడలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం
- కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీ అందించాలని పిలుపు



కోదాడ రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ టౌన్/కోదాడ రూరల్, మే 6 : కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయని, సాగర్ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వక వేలాది ఎకరాల పంటను రేవంత్ సర్కారు ఎండిబెట్టిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలో సోమవారం బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నా సాగర్ నుంచి పంటలకు నీరందించలేకపోయారని, ఖమ్మం జిల్లాకు నీళ్లు తరలివెళ్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. సాగర్ ఆయకట్టు రైతులకు ఏనాడూ పంటలు ఎండకుండా నీరందించిన ఘనత బీఆర్‌ఎస్ సర్కారుదేనన్నారు. రైతు బంధు అందక, రుణమాఫీ కాక రైతులు బ్యాంకుల చుట్టూ మళ్లీ తిరుగుతున్నారని, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారని, రాష్ట్రంలో 2014 ముందు పరిస్థితి దాపురించిందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి తనకే రైతుబంధుకు దిక్కులేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతను చూపుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని, నిరుద్యోగ భృతి రూ.4 వేలు, మహిళలకు రూ.2,500 ఏవని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రమాణ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలకోరు అన్నారు. రైతులను వీధి పాలుజేసిన రేవంత్ సర్కారుకు ఓటుతో బుద్ధి చెప్పాలని, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ కారుగుర్తుకు ఓటు వేసి నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు.

### కేసీఆర్ రాకతో కాంగ్రెస్, బీజేపీకి వణుకు : కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీకి వణుకుపుట్టిందని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. ప్రజా సమస్యలను ఢిల్లీలో వినిపించే గొంతుకనవుతానని, ప్రజలకు కారు గుర్తుకు ఓటువేసి అవకాశం కల్పించాలని కోరారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులకు రైతుల పట్ల సరైన అవగాహన లేదని, వారు ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి తీసుకున్న చర్యలు లేవని అన్నారు. తాము మంత్రులం అనే విషయాని మరిచి నిత్యం బీఆర్‌ఎస్ నాయకులపై నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తొలుత కోదాడ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ, డప్పులతో అభ్యర్థికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజవర్గ సమన్వయ కర్త కటికం సత్తయ్య గౌడ్, నాయకులు సుంకరి అజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కాసాని శ్రీనివాస్‌రావు, కౌన్సిలర్ బెజవాడ శ్రావణ్, మేదర లలిత, ఎస్కే షఫీ, మామిడి రామారావు, ముత్తవరపు రమేశ్, కోదాటి కృష్ణయ్య, నిజాం, అప్పినాయుడు పాల్గొన్నారు.



కోదాడలో రోడ్ షోకు పెద్దఎత్తున హాజరైన జనం

## పట్టభద్రుల ఎమ్మెల్సీకి నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి నామినేషన్

- కలెక్టరేట్ వరకు ర్యాలీ, మీటింగ్

నల్లగొండ ప్రతినిధి, మే6(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజవర్గ శాసన మండలి ఉప ఎన్నిక కోసం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ర్యాలీగా బయల్దేరి నల్లగొండ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో 11గంటలకు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేయనున్నారు. నామినేషన్ అనంతరం స్థానిక ఎంఎన్‌ఆర్ గార్డెన్స్‌లో కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొననున్నారు. నామినేషన్ కార్యక్రమంలో నల్లగొండతోపాటు వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండా ఎగురవేసి, ఉద్యమ ప్రాంతానికి ఊపిరూది మన అస్తిత్వాన్ని చాటుకోవాల్సిన సమయం ఇదని పేర్కొన్నారు. ఇక పట్టభద్రులంతా తనకు ఓటేసి గెలిపిస్తే శాసన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుగా గళం వినిపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు. నేటి తన నామినేషన్ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు, శ్రేణులు, పట్టభద్రులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి తనను ఆశీర్వదించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఐదో రోజు 16 నామినేషన్లు

నీలగిరి, మే 6 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికకు ఐదో రోజు సోమవారం 13 మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి వనుగుల రాకేశ్ ఒక సెట్, తెలుగు దేశం పార్టీ నుంచి ముంద్ర మల్లికార్జునరావు రెండు సెట్లు, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బరిగల దుర్గాప్రసాద్ మహారాజ్ ఒక సెట్, నేషనల్ నవక్రాంతి పార్టీ అభ్యర్థిగా కర్ని రవి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా పులి పాక సుజాత రెండు సెట్లు, తాడిశెట్టి క్రాంతి కుమార్ రెండు సెట్లు, చీదల్ల వెంకట సాంబ శివరావు, చీదల్ల ఉమామహేశ్వరి, అయితగోని రాఘవేంద్ర, భక్కా జడ్సన్, బుగ్గ శ్రీకాంత్, పాలకూరి అశోక్ కుమార్, దేశగాని సాంబశివరావు ఒక్కో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు. వీరు రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనతోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ములుగు జిల్లా అదనపు కలెక్టర్ జి.మహేందర్‌కు నామినేషన్లను సమర్పించారు.



ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దాసరి హరిచందన

## పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఇబ్బందులు లేకుండా చూడాలి

- నల్లగొండ కలెక్టర్ హరిచందన

నీలగిరి, మే 6 : ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఆదేశించారు. సోమవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని కోమటి రెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ప్రక్రియను పరిశీలించారు. ఉద్యోగులకు అసౌకర్యం కలుగకుండా హెల్ప్ డెస్క్, టెంటు, కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. అమె వెంట పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవి తదితరులు ఉన్నారు.



సూర్యాపేటలో మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

## ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, మే 11 : లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎం కమిషనింగ్ (బ్యాలెట్ పేపర్ అనుసంధానం) ప్రక్రియ అప్రమత్తంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సూర్యాపేట నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం కమిషనింగ్ , మాక్ పోలింగ్ విధానాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఈవీఎంలకు కమిషనింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వేణుమాదవ్, తాసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, కృష్ణయ్య, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


- నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, మే 6 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోసం ఏడు కంపెనీల కేంద్ర బలగాలు, 2,600 మంది జిల్లా సిబ్బందితో పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,677 పోలింగ్ కేంద్రాలకుగానూ 313 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ సిబ్బంది విధిగా పర్యటిస్తూ నిఘా పెట్టిందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజల్లో పోలీసులు భరోసా కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద 7 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# కొత్త జిల్లా మెడకు కత్తి

## ఆందోళనలో సూర్యాపేట జిల్లా ప్రజలు

- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రజల్లో అనేక అనుమానాలు
- ప్రజల చిరకాల కోరికను కేసీఆర్ నెరవేర్చితే కాంగ్రెస్ ఏం చేసేనో!
- హామీలు అమలు చెయ్యరు కానీ ఉన్నవాటిని పోగొడుతారా?
- మళ్లీ దూరభారం పెరుగనుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై జనం ఆగ్రహం




సూర్యాపేట, మే 6 (నమస్తే తెలంగాణ) : ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సూర్యాపేట జిల్లా ఉండేనా.. ఊడేనా? అని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునర్విభజన చేసి జిల్లాల సంఖ్యను కుదిస్తామని ప్రకటించడం, రాష్ట్రంలో తగ్గించే జిల్లాల జాబితాలో సూర్యాపేట కూడా ఉందని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. సూర్యాపేట జిల్లా కావాలనే ప్రజల చిరకాల కోరికను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ద్వారా మాజీ సీఎం కేసీఆర్ నెరవేర్చితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందోనని జనం భయపడుతున్నారు. ఐదు నెలల క్రితం ఇచ్చిన హామీలను నెరవేర్చరు కానీ ఉన్న వాటిని పోగొడుతారా? అని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### చేరువైన పాలన

సుమారు ఎనిమిదేండ్ల క్రితం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల అవసరాలు, భౌగోళిక పరిస్థితులను బట్టి అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలు చేపట్టింది. అందులో భాగంగా ప్రజలకు పాలన చేరువయ్యేందుకు జిల్లాల పునర్విభజన చేపట్టింది. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాను ఏర్పాటు చేశారు. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలతో సూర్యాపేట జిల్లా ఏర్పాటైన విషయం విదితమే. గత పూర్వ నల్లగొండ జిల్లాకు వెళ్లేందుకు తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలోని 60 నుంచి 70శాతం గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడేవారు. హుజూర్‌నగర్, కోదాడతో పాటు తుంగతుర్తి నియోజకవర్గాల ప్రజలు నల్లగొండకు వెళ్లేందుకు 80 నుంచి 140కిలోమీటర్ల దూరం ప్రయాణించి వ్యయప్రయాసాలకు లోనయ్యేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సూర్యాపేట జిల్లా ఏర్పడడంతో ఆ మూడు నియోజకవర్గాల ప్రజలకు 40 నుంచి 80 కిలోమీటర్లు, సూర్యాపేటకు 60 కిలోమీటర్ల దూరం తగ్గింది. ఎనిమిదేండ్లుగా ఏ ఇబ్బంది లేకుండా ప్రభుత్వ సేవలను ప్రజలు పొందుతున్నారు.

### జిల్లా పోతే అనేక నష్టాలు..

ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం సూర్యాపేట జిల్లాను తొలగిస్తే అనేక నష్టాలు జరిగే ప్రమాదం ఉంటుంది. సూర్యాపేట జిల్లా కేంద్రం కావడం వల్లనే మెడికల్ కళాశాల రాగా, జిల్లాను తొలగిస్తే కళాశాల, జనరల్ ఆస్పత్రి స్థాయి తగ్గిపోతుంది. అలాగే సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు అలంకారప్రాయంగా మారనున్నాయి. జిల్లా ఉంటే ఎప్పటికైనా నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయాలతోపాటు అనేక రకాల కేంద్ర ప్రభుత్వ సంస్థలు రానున్నాయి. జిల్లా లేకుంటే ప్రజలకు పాత కష్టాలు మళ్లీ మొదలవుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టి జిల్లాల సంఖ్యను కుదిస్తామని స్వయానా సీఎం రేవంత్ ప్రకటించడం, సూర్యాపేట జిల్లా కూడా పోతుందని సోషల్ మీడియాల్లో వార్తలు తిరుగుతుండడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం నాగార్జునసాగర్ నీటిని విడుదల చేయకుండా, గోదావరి జలాలు ఎత్తిపోయకుండా స్వయం ప్రకటిత కరువు తెచ్చి ప్రజలు, రైతులను నానా ఇబ్బందులకు గురి చేసింది. మరో పక్క జిల్లాలను కుదిస్తామనే ప్రకటనలతో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సిందేననే కృతనిశ్చయంతో ఉన్నట్లు కనిపిస్తున్నది.

### కొత్త జిల్లాలను తీసివేయడం సరికాదు



గతంలో నల్లగొండ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే మా ఊరి నుంచి 90కిలో మీటర్ల దూరం ఉండేది. ఏదైనా పనులకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేది. సూర్యాపేట జిల్లా ఏర్పాటు చేయడంతో మాకు బాధలు తప్పాయి. సూర్యాపేటకు 20 కిలో మీటర్లే.. ఇప్పుడు కలెక్టర్ కార్యాలయానికి వస్తే సమస్య లేకుండా పని చూసుకొని వెళ్తున్నాం. సూర్యాపేట జిల్లాను తీసివేస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఖాయం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇలాంటి పనులు చేయడం సరికాదు.

– బాణోతు దేవ్లా, పెద్దరాజుతండా, మోతె



పిల్లలమర్రిలో రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి నాగయ్య

## 1,429 ఎకరాల్లో మామిడి పంట నష్టం

- 17.5ఎకరాల్లో దెబ్బతిన్న అరటి తోటలు

సూర్యాపేట/సూర్యాపేట రూరల్, మే 6 : జిల్లాలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాయంత్రం నుంచి రాత్రి పది గంటల వరకు భారీగా ఈదురుగాలులు వీయడంతో 10 మండలాల పరిధిలో 447 మంది రైతులకు చెందిన 1,429 ఎకరాల్లో మామిడి కాయలు రాలినట్లు ఉద్యానవన అధికారులు ప్రాధమికంగా అంచనా వేశారు. ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. చేతికి వచ్చి అమ్ముకునే సమయంలో మామిడి కాయలు రాలడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మరో నలుగురు రైతులకు చెందిన 17.5 ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది.

### పంట నష్టం పరిశీలన

సూర్యాపేట పరిధిలోని పిల్లలమర్రి, ఆత్మకూర్.ఎస్ మండలంలోని ఎనుబాముల గ్రామంలో దెబ్బతిన్న మామిడి తోటలను జిల్లా ఉద్యానవన అధికారి అధికారి టి.నాగయ్య సోమవారం పరిశీలించారు. పంట నష్టం నివేదికను వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది ద్వారా ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఆయన వెంట సూర్యాపేట ప్రాంతీయ ఉద్యానవన అధికారి జగన్ ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ఎస్సీలు దూరం!

## మోత్కుపల్లి తిరుగుబాటుతో భువనగిరిలో సీన్ రివర్స్

- ఆలేరు, తుంగుతుర్తిలో ప్రభావం
- ఇప్పటికే హస్తం పార్టీపై బీసీల్లో వ్యతిరేకత
- 'రెడ్లు..రెడ్లు' ఒకటంటూ చామల క్యాస్ట్ అస్త్రం
- బీజేపీలోని రెడ్లతో అంతర్గతంగా టచ్‌లోకి..
- ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నారని జోరుగా ప్రచారం
- కిరణ్‌కుమారెడ్డి తీరుపై స్థానిక కాంగ్రెస్ నేతల గుర్రు

యాదాద్రి భువనగిరి, మే 6 (నమస్తే తెలంగాణ) : భువనగిరి కాంగ్రెస్‌లో రోజురోజుకు సీన్ రివర్సవుతున్నది. అటు బీఆర్‌ఎస్ పుంజుకుంటుండగా ఇటు కాంగ్రెస్ డీలా పడిపోతున్నది. ముఖ్యంగా ఎస్సీ ఓటర్లు దూరమవుతున్నారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి తిరుగుబాటుతో వేగంగా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే బీసీలకు టికెట్ ఇవ్వలేదని హస్తం పార్టీపై బీసీల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. దీనికి తోడు కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రెడ్డి రాజకీయాలకు తెరలేపారు. రెడ్లంతా ఏకం కావాలని అంతర్గతంగా మంతనాలు జరుపుతున్నారు. ఏకంగా బీజేపీలోని రెడ్లతో టచ్‌లోకి వెళ్లడంతోపాటు ప్యాకేజీలు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దాంతో స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు.

### తెరపైకి చామల 'రెడ్డి' అస్త్రం..

ఓ వైపు బీఆర్‌ఎస్ పుంజుకోవడం, మరో వైపు జనంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తుండటంతో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఏం చేయాలో పాలుపోని స్థితిలో నెలకొంది. ఈ నేపథ్యంలో భువనగిరి పార్లమెంట్ పరిధిలో చామల.. రెడ్డి క్యాస్ట్ రాజకీయాలను తెరపైకి తీసుకొచ్చారు. రెడ్లు రెడ్లు ఒకటంటూ మచ్చిక చేసుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే పార్టీలకు అతీతంగా అంతర్గతంగా సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది. ఇక బీజేపీలోని రెడ్లతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని సమాచారం. ఆయా లీడర్లకు ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది.

### కాంగ్రెస్‌పై మోత్కుపల్లి తిరుగుబాటు

మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు ఆ పార్టీపై తిరుగుబాటు చేస్తున్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 80లక్షల మంది ఉన్న మాదిగలను పరిగణలోకి తీసుకోపోవడంపై బహిరంగంగానే కాంగ్రెస్ తీరును తూర్పారబడుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపట్టి.. నిరసన వ్యక్తం చేశారు. పలు దఫాలుగా ప్రెస్‌మీట్లు ఏర్పాటు చేసి.. రేవంత్ రెడ్డి మాదిగలను తొక్కేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీలోనే మాదిగలకు గుర్తింపు ఉందని అభిప్రాయపడ్డారు.

### ఇప్పటికే బీసీల్లో వ్యతిరేకత

కాంగ్రెస్ పార్టీ తీరుపై బీసీల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత స్పష్టమవుతున్నది. కాంగ్రెస్ అంటేనే రెడ్ల పార్టీ అనే భావనకు వచ్చారు. అధికారంలోకి వచ్చాక రెడ్లకు మాత్రమే ప్రా ధాన్యం ఇస్తున్నారనే అపవాదుకు ఆజ్యం పోస్తున్నారు. భువనగిరిలో బీఆర్‌ఎస్, బీజేపీ బీసీ అభ్యర్థులను బరిలోకి దింపింది. కానీ హస్తం పార్టీ మాత్రం ఇందుకు భిన్నంగా రెడ్డిని పోటీలో నిలిపింది. ఇక్కడి నుంచే బీసీల్లో కాంగ్రెస్‌పై అసహనం పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు తాజాగా మళ్లీ రెడ్డి ఫీలింగ్ తీసుకురావడంతో బీసీల్లో అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది.

### చామల తీరుపై స్థానిక నేతల గుర్రు..

ఇదిలా కొనసాగుతుండగానే కాంగ్రెస్‌లో కొత్త పంచాయితీ షురూ అవుతున్నది. స్థానికంగా ఉన్న తమని కాదని, చామల కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలోని రెడ్లను సంప్రదిస్తుండటపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పదేండ్ల నుంచి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినా పట్టించుకోకుండా, పక్క పార్టీ నేతలకు ప్యాకేజీలు ఇవ్వడం ఏంటనే లొల్లి నడుస్తున్నది.

### రెండు నియోజకవర్గాల్లో ఎఫెక్ట్

మోత్కుపల్లి నర్సింహులు ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయనకంటూ ప్రత్యేక వర్గం ఉంది. ముఖ్యంగా భువనగిరి పార్లమెంట్ పరిధిలో కీలకమైన వ్యక్తి. ఆలేరు, తుంగతుర్తి నుంచి గెలిచారు. తుంగతుర్తి, నకిరేకల్ ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గాలు. దాంతో ఆయా నియోజకవర్గాల్లో మోత్కుపల్లి ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్నది. ఎస్సీ సామాజిక వర్గాల్లో ఆయనకు గుర్తింపు ఉంది. ఇప్పటికీ ఆయన నోటి మాటతో కట్టుబడి పనిచేసే నాయకులు ఉన్నారు. ప్రస్తుతం నర్సింహులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ముందుకు వెళ్తుండటంతో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతే కాకుండా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపుతో ఇప్పటికే 50శాతానికి పైగా ఎస్సీలు కాంగ్రెస్‌కు దూరమయ్యారు.